సాక్షి
వికారాబాద్
ఆదివారం । 21 । జనవరి । 2024



యథేచ్ఛగా బియ్యం దందా

అనుమతి లేకుండా తరలిస్తున్న 163 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 10లో▸



మాక్ పోలింగ్

కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు మాక్ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించారు. 10లో▸



జొన్న.. సన్నగిల్లె!

జొన్న సాగు విస్తీర్ణం తగ్గుతోంది. వేల ఎకరాల్లో సాగయ్యే పంట నేడు వందల ఎకరాల్లోనే సాగుచేస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

రైతుబంధు @ రూ.86.65 కోట్లు

బషీరాబాద్: రైతుబంధు సాయం నత్తనడకన కొనసాగుతోంది. జనవరి 20 వరకు జిల్లాలో 1,60,769 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.86,65,48,270 నిధులను జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా 2.92లక్షల మంది రైతులుండగా ఆరు లక్షల ఎకరాలకు పైగా సాగుభూములున్నాయి. ఇప్పటి వరకు 2.5 ఎకరాల విస్తీర్ణం వరకు భూములున్న వారికే నగదు జమ చేసినట్లు వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. 1.31లక్షల మంది అన్నదాతలకు నేటికీ ఎదురు చూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం మాదిరిగానే ఏడాదికి రూ.10 వేల చొప్పున నగదు జమ చేస్తోంది. వచ్చే వానాకాలం పంట నుంచి రైతుభరోసా అమలు చేస్తామని రేవంత్ సర్కార్ నిర్ణయించిన విషయం విదితమే.

23న జాబ్‌మేళా

జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్దుల్ సుభాన్



వికారాబాద్ అర్బన్/ పరిగి: ఈ నెల 23న పట్టణ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్దుల్ సుభాన్ తెలి పారు. శనివారం ఆ యన మాట్లా డుతూ.. పట్టణ కేంద్రంలోని నంబర్-1 పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించే ఈ మేళాలో రాష్ట్రంలోని 50ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఐదువేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే 9676047444, 9182477163 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'మోడల్' ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రిన్సిపాల్ సరళారెడ్డి



బంట్వారం: ఆరోతరగతి ప్రవేశ పరీక్షతో పాటుగా ఏడు నుంచి పదోతరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బంట్వారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి నిర్వహించే ఈ పరీక్షకు ఏప్రిల్ 1 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7న బంట్వారం మోడల్ స్కూల్‌లో పరీక్ష ఉంటుందని చెప్పారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు ఉంటుందన్నారు. మిగిలిన తరగతులకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

26 నుంచి జీఎస్‌ఎం క్రికెట్ టోర్నీ

స్పీకర్ సతీమణి జ్ఞాపకార్థం పోటీలు

ధారూరు: శాసనసభ స్పీకర్ సతీమణి శైలజ జ్ఞాపకార్థం గడ్డం శైలజా మెమోరియల్(జీఎస్ఎం) క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి మండల కేంద్రంలో టోర్నీ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందుకు రూ.వేయి ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. విజేత జట్టుకు రూ. 25వేలు, రన్నరప్ జట్టుకు రూ.15వేలు నగదు బహుమతితో పాటుగా షీల్డ్‌లు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 9014795036, 7981230824, 7093516593, 9849988545 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు చిలుకూరులో ప్రత్యేక ప్రదక్షిణలు

బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక ప్రదక్షిణలు, పాద యాత్ర నిర్వహించనున్నట్లు చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22న సోమవారం ఉదయం అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక ప్రదక్షిణలు చేపడతామన్నారు. ఆలయం బయటి నుంచి మహా పరిక్రమ (ప్రదక్షిణ), ఆలయం లోపల అంతర్గత పరిక్రమ ప్రత్యేకంగా చేపట్టి సర్వ శక్తిమంతుడికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలపనున్నట్లు ఆయన చెప్పారు. చిలుకూరు గ్రామంలోని హనుమాన్ దేవాలయం వరకు పాద యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడిచారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సాగేనా.. ఆగేనా..?

పెట్టుబడులను ఆకర్షించి ఉద్యోగాలను సృష్టించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం తెలంగాణ మొబిలిటీ వ్యాలీ (టీఎంవీ) ప్రాజెక్టు ఏర్పాటుకు సంకల్పించింది. ప్రభుత్వ మార్పుతో వీటి కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- రూ.4వేల కోట్ల వ్యయంతో 'మొబిలిటీ వ్యాలీ' ఏర్పాటుకు ఒప్పందం
- ప్రాజెక్టు పూర్తయితే పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఇప్పటికే 1200 ఎకరాల భూసేకరణ పూర్తి
- భూములు కోల్పోయిన ప్రతీ ఇంటికి ఉద్యోగం
- అందిన పరిహారంతో రైతుల అసంతృప్తి



మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న ప్రాంతం

వికారాబాద్: జిల్లాకు తరలివచ్చిందని భావించిన ప్రాజెక్టు ఆగుతుందా.. యథావిధిగా ముందుకు సాగుతుందా..? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. మోమిన్‌పేట, నవాబుపేట మండలాల సరిహద్దు గ్రామాలైన ఎన్కెతల, ఆర్కతల గ్రామాల రెవెన్యూ పరిధిలో ఓ బడా ప్రాజెక్టు ఏర్పాటుకు గత ప్రభుత్వం సంకల్పించింది. 2023 ఫిబ్రవరి 6న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో 'మొబిలిటీ నెక్స్ హైదరాబాద్ సమ్మిట్-2023' పేరిట నిర్వహించిన సదస్సులో ఈ ప్రాజెక్టు పురుడుపోసుకుంది. ఈ క్లస్టర్ అభివృద్ధికి జర్మన్ సర్వీస్ ప్రొవైడర్ ఏటీఎస్-టీయూవీ రైన్‌ల్యాండ్‌తో రూ.250కోట్ల పెట్టుబడులకు రాష్ట్రం అవగాహన ఒప్పందం చేసుకుంది.

భూసేకరణ పూర్తి

రాజధాని నగరానికి జిల్లా కూతవేటు దూరంలో ఉన్నా.. అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. టీఎంవీ ప్రాజెక్టు పూర్తైతే జిల్లా అభివృద్ధికి దోహదం చేస్తుందని అంతా భావించారు. జిల్లా రూపురేఖలు మారుతాయని బీఆర్‌ఎస్ నేతలు సైతం పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనుకున్నారు. గండిపేట డెవలప్‌మెంట్ అథారిటీ కారిడార్‌లో భాగంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అధికారులు సైతం యుద్ధ ప్రాతిపదిక కసరత్తు ప్రారంభించి భూ సేకరణ పూర్తి చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరండంతో ప్రాజెక్టును ప్రారంభిస్తారా.. లేదా ఆగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పది నెలల క్రితమే పరిహారం

ఎన్కెతల, ఆర్కతల గ్రామాల రెవెన్యూ పరిధిలో కొంత భూమిని ఏడాది క్రితమే టీఎస్ఐఐసీ అప్పగించారు. భూములు కోల్పోయిన అసైన్డ్‌దారులకు పది నెలల క్రితమే పరిహారం అందజేశారు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న భూముల వాస్తవ ధరలకు ప్రభుత్వం చెల్లించిన ధరకు పొంతన లేకుండా ఉండటంతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. ముందుగా నవాబుపేట మండల పరిధిలో సేకరించిన భూములకు ఎకరానికి రూ.16లక్షల చొప్పున ఆ తరువాత మోమిన్‌పేట మండల పరిధిలో సేకరించిన భూములకు ఎకరానికి రూ.17లక్షల చొప్పున చెల్లించారు. అయితే ఆ ప్రాంతంలో భూమి ప్రస్తుతం ఎకరానికి రూ. కోటికి పైగా పలుకుతోంది. దీంతో తమ భూములకు మార్కెట్ ధరలో సగమైనా చెల్లించలేదని ఆ గ్రామ రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలాగో భూములు కోల్పోయాం.. ప్రాజెక్టు త్వరతగతిన పూర్తి చేస్తే తమ పిల్లలకు ఉద్యోగాలైనా వస్తాయని భావిస్తున్నారు. అయితే ప్రాజెక్టు పనుల ప్రారంభం విషయంలో నేటికీ ఉలుకూ.. పలుకూ లేకపోవటంతో భూములు కోల్పోయిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం

ఎన్కెతల, ఆర్కతల గ్రామాల శివారులోగల ప్రభుత్వ భూమిలో 1200 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రూ.4వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భూములు కోల్పోయిన అసైన్డ్ పట్టాదారులకు నేరుగా 500 మందితో పాటుగా స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టులో ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు తయారు చేయనున్నారు. పెద్ద ప్రాజెక్టు అవ్వడం వల్ల జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయని విశ్లేషకులు వివరించారు. జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల రేడియేషన్‌లో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. దీంతో జిల్లా పరిధిలోని నవాబుపేట, మోమిన్‌పేట, వికారాబాద్ మండలాలు, రంగారెడ్డిజిల్లా పరిధిలోని శంకర్‌పల్లి, సంగారెడ్డి మండల పరిధిలోని కొండాపూర్ మండలాలల ప్రాంతం ప్రత్యేక ఆర్థిక మండలిగా రూపాంతరం చెందనుంది. బడా ప్రాజెక్టు కావటంతో నగరం నుంచి కనెక్టివిటీ రోడ్లు కూడా మెరుగుపడనున్నాయి. చుట్టు పక్కల మండలాల్లోనూ భూముల విలువలు సైతం పెరగనున్నాయి. నవాబుపేట మండలం ఆర్కతల శివారులో గతంలో సర్వే నెంబర్ 32లో 102 ఎకరాలు, సర్వే నెంబర్ 12లో 57 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించిన అధికారులు టీఎస్ఐఐసీకి అప్పగించారు. మోమిన్‌పేట మండలం ఎన్కెతల పరిధిలోని 174, 198 సర్వే నెంబర్లలో మొత్తం 900 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో ఆధ్యాత్మిక, దివ్యాంగుల సంస్థలకు కొంత భూమిని కేటాయించారు. 536.39 ఎకరాల ప్రభుత్వ భూమి టీఎస్ఐఐసీకి ఇచ్చేందుకు అనుకూలంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో 380 మంది అసైన్డ్ పట్టాదారులున్నారు. భూములు కోల్పోయిన వారికి పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇచ్చేందుకు మొబిలిటీ వ్యాలీ సంస్థ అంగీకరించినట్టు అధికారులు వివరించారు.



రైస్ మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

టార్గెట్ పూర్తి చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వానాకాలం పంటలకు సంబంధించి సీఎంఆర్ రైస్ టార్గెట్ వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు నిర్దేశించిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లర్స్ కలిసికట్టుగా టార్గెట్ పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌర సరఫరాల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పనులు చేపట్టాలన్నారు. మిల్లర్లు విధులు సక్రమంగా నిర్వహి స్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అవుట్ పేషెంట్ సేవలు ప్రారంభించండి

నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రిలో అవుట్ పేషెంట్ విభాగంలో రోగులకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన వికారాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. వారం రోజుల్లో ఓపీ ప్రారంభించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రోగులకు సేవలు అందించేందుకు సదుపాయాలు కల్పిస్తూ మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు.

పారదర్శకత అవసరం

ఓటరు నమోదును పారదర్శకంగా చేపట్టేలా బూత్ స్థాయి అధికారులు పనిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ఓటరు నమోదుకు జనవరి 20, 21న ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. సంఘం లక్ష్మీబాయి ఉన్నతపాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. ఓటరు నమోదు, ఐడీ కార్డులు చేర్పులు, మార్పులు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌ఓలకు ఆయన సూచించారు. రెండు సార్లు ఓటరుగా నమోదైతే వాటిని పరిశీలించాలన్నారు. 20 సంవత్సరాలు దాటిన వ్యక్తులు ఓటరుగా నమోదు వ్యక్తులు ఓటరు నమోదు చేసుకుంటే వాటిని ధృవీకరించాలన్నారు. జాబితాలో తొలగింపులు, దిద్దుబాట్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను సైతం సకాలంలో పరిశీలించాలని తెలిపారు. అనంతరం ఆన్‌లైన్ దరఖాస్తులపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

పోరాటం ప్రజల పక్షం

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- కార్యకర్తల సమావేశంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలబడాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర సాధనకు అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్ర ఎంతో అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ వారి పక్షాన నిలబడాలని సూచించారు. అధికారం లేదని కార్యకర్తలు అధైర్య పడవద్దని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేసి పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపుదామని పిలుపునిచ్చారు. రైతుబంధు పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి ప్రతీ పంటకు పెట్టుబడి సాయం అందేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు నెలలయినా నేటికీ నగదు జమచేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటుగా మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతీ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున కార్యకర్తలకు కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై మరోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు

మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్‌లో శనివారం ఓ మేక ఒకే ఈతలో ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకటి చనిపోగా మిగిలిన నాలుగు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు లింగంపల్లి మల్లేశ్ తెలిపారు. ఒకేసారి ఐదు మేక పిల్లలు పుట్టడం చాలా అరుదని జీవాల కాపరులు తెలిపారు. వీటిని చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపారు.

– యాలాల



ప్రతీ ముస్లిం పట్టభద్రుడవ్వాలి

- ఆడపిల్లలు ఉన్నత విద్య అభ్యసించాలి
- ఎంఐఎంతోనే ముస్లింల అభ్యున్నతి
- పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్

తాండూరు: కావాలని గొడవలు సృష్టించిన వారు తన వద్దకు రావద్దని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ అన్నారు. శనివారం పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్‌లో సలార్ ఏ మిల్లత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 10వ తరగతి మైనార్టీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, గైడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, ముస్లింలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. మైనార్టీలకు విద్యను అందించేందుకు నాలుగు దశాబ్దాలుగా ఎంఐఎం పార్టీ చేస్తోందన్నారు. ముస్లిం కుటుంబాల్లో బాలిక విద్యను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. మజ్లిస్ ముస్లింల హక్కులకు గతంలో పోరాటం చేయడంతో ప్రస్తుతం ఫలితాలు వస్తున్నాయన్నారు. కొందరు పార్టీ ప్రతిష్టను తగ్గించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు తమను ఆదరిస్తున్నారన్నారు. ముస్లింలు ఉన్నత విద్యను అభ్యసించి పట్టభద్రులు కావాలని ఆకాంక్షించారు. విద్యను ప్రోత్సహించేందుకే తాను హైదరాబాద్‌లో మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల తదితర విద్యా సంస్థలను నెలకొల్పానని చెప్పారు. దశాబ్దాలుగా వందలాది మంది తమ కళాశాలలో వైద్యవిద్యను అభ్యసించి దేశ విదేశాలలో స్థిరపడ్డారన్నారు.పార్టీ అండదండలు ఉన్నాయని ఎవరైనా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తన వద్దకు రావద్దన్నారు. రాజకీయాలకోసం గొడవలు పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నేత ఎంఏ హదీషహేరీ,మున్సిపల్ కౌన్సిలర్లు సాజిద్,బాంబినా,నాయకులుముస్తాఫా, ఖరీంఖాన్ న్నారు.

ఎంపీ వర్సెస్ మాజీ ఎంపీ

- రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి మధ్య మాటల యుద్ధం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్రమంతా చలిగాలులు వీస్తుంటే.. చేవెళ్లలో రాజకీయ ఉక్కపోత మొదలైంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి.. బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. గెలుపు కోసం ఇద్దరు నేతలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. సంస్థాగతంగా బలమైన నేతలను తమవైపు తిప్పుకొనేందుకు పావులు కదుపుతున్నారు. ఇతర పార్టీల్లో ఉన్న నేతలను తమ పార్టీలో చేర్పించుకునేందుకు పోటీపడుతున్నారు. ఈ క్రమంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇటీవల ఓ సర్పంచ్‌కి ఫోన్ చేశారు. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలోకి రావాల్సిందిగా అభ్యర్థించారు. విషయం రంజిత్‌రెడ్డికి తెలిసి అగ్గి మీద గుగ్గిలమయ్యారు. ఏకంగా విశ్వేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటామాటా పెరిగింది. ఎంపీ రంజిత్‌రెడ్డి అసభ్య పదజాలం ఉపయోగించడంపై కొండా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ శనివారం బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు నేతలూ ఆర్థిక దిగ్గజాలే కావడం, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగనుండడంతో రాజకీయంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

కాలం చెల్లిన మందులు విక్రయించొద్దు

జిల్లా మాదక ద్రవ్య నిరోధక శాఖ అధికారి క్రాంతికుమార్



మెడికల్ దుకాణాన్ని పరిశీలిస్తున్న క్రాంతికుమార్

దోమ: మెడికల్ దుకాణాల్లో కాలం చెల్లిన మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మాదక ద్రవ్య నిరోధక శాఖ అధికారి క్రాంతి కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ఎమ్మాఆర్ఎస్ మెడికల్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. శుక్రవారం పాలేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి(18) అనే విద్యార్థి కాలం చెల్లిన ట్యాబ్లెట్ వేసుకోవడంతోనే ఆరోగ్యం వికటించి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మెడికల్‌షాప్‌ను సందర్శించిన క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూటర్ మెడికల్ దుకాణానికి కాలం చెల్లిన మందులు పంపిణీ చేసినట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఆ ట్యాబ్లెట్ ఎక్కడి నుంచి బాధితులకు సరఫరా జరిగిందో గుర్తించలేకపోయామని, ఆర్ఎంపీ డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్‌లోనూ ఆ మెడిసిన్ లేదన్నారు. అమ్మాయి మృతికి కారణాన్ని గుర్తించేందుకు పీఎస్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుంటామన్నారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్ట్ ఆధారంగా పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

క్లుప్తంగా

రేపు ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు

తాండూరు టౌన్: రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని తాండూరు గోశాల సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్‌కుమార్ శుక్రవారం విద్యా సంస్థల యాజమాన్యాలను కోరారు. సోమవారం పట్టణంలోని గోశాలలో సీతారాముల కల్యాణోత్సవం, అన్ని ఆలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో విద్యార్థులకు పాల్గొనే అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ప్రైవేటు పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

శ్రీరాముడి శోభాయాత్రకు విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న పట్టణ కేంద్రంలో భారీ ఎత్తున శ్రీరాముడి శోభయాత్ర నిర్వహించేందుకు భక్తులు సమాయత్తమవుతున్నారు. ఇందుకు గాను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రూ.3లక్షల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



విద్యార్థుల హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీజేసీ), ప్రభుత్వ నంబర్‌వన్, నలంద, సెయింట్ మార్క్స్ పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. మొత్తం 928 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా.. 288 మంది హాజరయ్యారు.

బైక్‌ను ఢీకొట్టిన డోజర్

మొయినాబాద్: అతివేగం, అజాగ్రత్తతో వచ్చిన డోజర్, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలోని తాజ్ హోటల్ వద్ద చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చెందిన శ్రీకాంత్ మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలోని రాణే ఇంజన్ వాల్వ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా తాజ్ హోటల్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన డోజర్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శ్రీకాంత్ ఎగిరి కింద పడటంతో కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా

రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జిల్లాలో ప్రతీరోజు ఏదో ఒక చోట పట్టివేత జరుగుతూనే ఉంది. పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు వలవేసి పట్టుకుంటున్నా.. ఈ వ్యవహారం ఆగడం లేదు. తమకు పడే శిక్ష తక్కువగా ఉండడంతో అక్రమార్కులు అంతకంతకూ చెలరేగిపోతున్నారు. నిర్భయంగా బియ్యాన్ని పక్కదారి పట్టించి ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



కస్తూరుపల్లి గ్రామంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి
- పరారీలో నిందితుడు

కొడంగల్: వేర్వేరు ప్రాంతాల్లో అనుమతి లేకుండా తరలిస్తున్న 163 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని కస్తూరుపల్లి గ్రామంలో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, కొడంగల్ సివిల్ పోలీసులు మూకుమ్మడిగా దాడి చేసి అక్రమంగా తరలిస్తున్న 55 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గణపతిరావు, కొడంగల్ ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

అంతారం, గుముడాల గ్రామాల్లో..

దౌల్తాబాద్: మండలంలోని అంతారం, గుముడాల గ్రామాల్లో శనివారం ఉదయం 108 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతారం గ్రామానికి చెందిన వ్యాపారి తుప్పు వెంకటేశ్ అక్రమంగా బొలేరో వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ప్రశాంత్‌వర్ధన్, సిబ్బంది తనిఖీలు చేశారు. సోదా చేస్తున్న సమయంలో వ్యాపారి వాహనాన్ని వదిలి పరారయ్యాడు. వాహనంలో 30 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, వెంకటేశ్ ఇంటిపై కూడా దాడి చేశారు. అక్కడ 78 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి బియ్యం బస్తాలను కొడంగల్ గోదాంకు తరలించారు. వ్యాపారిని త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



సర్పంచ్‌ను సన్మానిస్తున్న మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

కలిసికట్టుగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: కలిసికట్టుగా తాండూరును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని, ఎన్నికల ముగిసిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెడతామని అన్నారు. పార్టీలకు అతీతంగా తాండూరు అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం పలు సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు సమావేశంలో ప్రస్తావించారు. పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ వెంకట్రావ్, ఫారెస్ట్‌రేంజ్ అధికారి శ్యాంసుందర్‌రావు, తహసీల్దార్ తారాసింగ్ పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం బూత్ స్థాయిలో బీఎల్‌ఓలతో ఓటరు జాబితాపై ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా మండల పరిధిలోని మెట్లకుంట, బొంరాస్‌పేటలోని పోలింగ్ కేంద్రాలను లింగ్యానాయక్ పరిశీలించారు. మెట్లకుంటలోని పోలింగ్ కేంద్రం నం.177 నుంచి 180 వరకు, బొంరాస్‌పేటలోని 190 నుంచి 193 కేంద్రాలను, బొంరాస్‌పేట మండల 72 పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బీఎల్‌ఓలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. 6, 7, 8 ఫారంలను స్వీకరించాలని సూచించారు. అలాగే ఏఎస్‌డీ జాబితాను తయారు చేయాలన్నారు. ఈ నెల 20, 21న నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఓటరు జాబితాలో ఉన్న రెండు ప్రదేశాల్లో ఓట్లు ఉన్న వారి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి విచారించి వారి ఆమోదంతోనే ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించాలని అధికారులను ఆదేశించారు. శనివారం స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలోని 107, 108 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి , బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

దరఖాస్తు చేసుకోండి

పరిగి: కొత్త ఓటరు నమోదుతోపాటు ఓటరు కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ విజయకుమారి సూచించారు. ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పరిగి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ పరిధిలో లేని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు వేయడానికి బారులుదీరిన విద్యార్థులు

- విద్యార్థులతో నమూనా ఎలక్షన్ నిర్వహణ
- ఓటర్లు, ఎన్నికల సిబ్బంది, పోటీదారులుగా విద్యార్థులు
- ఎన్నికలు, ఓటు హక్కుపై అవగాహన అవసరమంటున్న ఉపాధ్యాయులు

దోమ: కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు మాక్ పోలింగ్ (నమూన ఎలక్షన్)ను విజయవంతంగా నిర్వహించారు. 8వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్నికల్లో పోటీదారులుగా, ఓటర్లుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా విధులు నిర్వహించి అలరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు శ్రీలత పర్యవేక్షణలో మాక్ పోలింగ్ నిర్వహించారు. మొత్తం 221 మంది ఓటర్లకు గాను.. 10 మంది అభ్యర్థులు పోటీలో నిలబడ్డారు. 181 మంది ఆయా అభ్యర్థులకు ఓట్లు వేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కొనసాగింది. 84 శాతం ఓటింగ్ జరిగింది. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎన్నికల విధానంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.



మాక్ పోలింగ్‌లో ఏజెంట్లుగా విధులు నిర్వహిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్, గోపాల్, బీమ్యానాయక్, వాణి, విజయలక్ష్మి, శ్రీలత, శ్రీనివాస్, అమృత, బాలమణి, శాంతి, మల్లేశం, కిరణ్, నర్సింహులు, సీఆర్‌పీ రెడ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, అందుకు ఏఏ వార్డుల్లో ఏ పనులు చేపట్టాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వార్డుల పర్యటనలో భాగంగా శనివారం మున్సిపల్ పరిధిలోని 29, 31, 17, 19, 20వ వార్డులో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు, కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను నమోదు చేసుకున్నారు. త్వరలో విడదలయ్యే నిధులతో ఆయా వార్డుల్లో గుర్తించిన పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో కమిషనర్ జాకీర్ అహ్మద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, కౌన్సిలర్ గాయిత్రి లక్ష్మణ్ తదితరులున్నారు.



శివరాంనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్

హిందువుల కల నెరవేరబోతోంది

శంకర్‌పల్లి: శ్రీరాముడు జాతికి ఆదర్శ పురుషుడని. 500 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, 2లక్షల మంది ప్రాణత్యాగాల తర్వాత హిందువుల కల నెరవేరబోతోందని ఆధ్యాత్మిక వేత్త, రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ భాస్కరయోగి అన్నారు. మండల పరిధిలోని మహాలింగాపురంలో శనివారం నిర్వహించిన అయోధ్య రాముడి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతా రామనామ స్మరణతో మార్మోగుతోందని తెలిపారు. ఊరూరా ఈ సంబరాలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత నాయకులు దామోదర్‌రెడ్డి, నాగభూషణం, నరసింహారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న భాస్కరయోగి తదితరులు

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి

కుల్కచర్ల: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి అన్నారు. శనివారం ఆమె బాల్యవివాహాలను అరికట్టడం, బాలికలపై వేధింపులను ఎలా ఎదర్కోవాలి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలోని మంచి చెడుల గురించి తెలుసుకోవడంతో పాటుగా తల్లిదండ్రులకు తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. పాఠశాలలో నేర్చుకున్న విషయాలను సమాజానికి మేలు జరిగేలా ఇతరులకు సూచించాలన్నారు. బాల్యవివాహాలు, అనాథ పిల్లలను చూడాల్సిన విధానం.. వారికి ప్రభుత్వం నుంచి అందే సాయం తదితర విషయాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

అనంతగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మిక, కర్షక లోకం సిద్ధమవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అన్నారు. శనివారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్రం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం వెనక్కి తీసుకువస్తామని ఉచిత హామీలు ఇచ్చిందని విమర్శించారు. బీజేపీ పాలనలో నిత్యవసరాల ధరలు పెరగడంతో ప్రజలకు జీవనం భారంగా మారిందని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 26న జిల్లా, మండల కేంద్రాల్లో బైక్‌ర్యాలీలు, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, నాయకులు రామకృష్ణ, బుగ్గప్ప, లాలయ్య, సత్తయ్య, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ మహిళకు కొత్త రుణాలు

ఏపీఎం మధుకర్

మర్పల్లి: అర్హత కలిగిన ప్రతి మహిళా సంఘానికి ఫిబ్రవరి నెలాఖరు కల్లా బ్యాంకుల ద్వారా కొత్త రుణాలు అందజేస్తామని ఇందిర క్రాంతి పథకం ఏపీఎం మధుకర్ మండల మహిళా సంఘం కార్యవర్గానికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మండల మహిళ సమైఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల రుణాల రికవరీ, రుణాల చెల్లింపులు ఇతరాత్ర కార్యక్రమాలపై ఐకేపీ సీసీలతో బుక్ కీపర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించేలా సీసీలు, బుక్ కీపర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలు చెల్లించిన వారికి ఫిబ్రవరి నెలాఖరుకు కొత్త రుణాలు ఇప్పిస్తామన్నారు. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య సంఘం అధ్యక్షురాలు జగదాంబ, కార్యదర్శి సుజాత, ఉపాధ్యక్షురాలు మంజుల కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజ్, నవీన్ ఆయా గ్రామాల అధక్ష కార్యదర్శులు, సీసీలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

బతికుండగానే సంచిలో కుక్కారు!

పోలీసులకు సవాల్‌గా మారిన ఆదిబట్ల హత్య కేసు

- ఊపిరాడకే మరణించినట్లు ప్రాథమిక నిర్ధారణ
- శరీరంలో లభించని విష ప్రయోగం ఆనవాళ్లు, గాయాలు
- సాంకేతిక ఆధారాలతోనే కేసు దర్యాప్తు
- హతుడిని గుర్తించేందుకు రాష్ట్రంలోని అదృశ్య కేసులన్నీ జల్లెడ
- 12 లక్షల వాహనాలు, లక్షల కొద్దీ కాల్ డేటా విశ్లేషణ

సాక్షి, సిటీబ్యూరో: ఆదిభట్ల ఠాణా పరిధిలో జరిగిన హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. హతుడు బతికుండగానే నోటికి ప్లాస్టర్ వేసి, కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి బలవంతంగా గోనె సంచిలో కుక్కారని, గాలి కూడా చొరబడకుండా మూటగట్టిగా కట్టేయడంతో లోపల ఊపిరాడక మరణించి ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈనెల 16న బొంగుళూరు టోల్‌గేట్ నుంచి 1.5 కి.మీల దూరంలో బ్రాహ్మణపల్లి సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే.

తెలిసిన వాళ్ల పనే..

హత్య అనంతరం మృతదేహాన్ని ఎక్కడ పారేయాలో కూడా దుండగులు ముందుగానే ప్లాన్ చేశారని, ఈ క్రమంలోనే సంక్రాంతి సెలవుల్లో జాతీయ రహదారులలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఎవరూ గుర్తించలేరని నిందితులు భావించి ఉంటారని పోలీసులు పేర్కొన్నారు. హతుడికి తెలిసిన వాళ్లే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సంచిలో మూటకట్టిన మృతదేహాన్ని తీసుకొచ్చి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో పడేసి ఉంటారని వివరించారు. అయితే ఆ ప్రాంతంలో ఎలాంటి వాహన టైర్ల గుర్తులు లభించలేదని, రోడ్డు పైన ఎర్రటి మరకలు ఉండడంతో రక్తం కావచ్చని అనుమానించి..నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని చెప్పారు.

సాంకేతిక ఆధారాలతోనే ముందుకు..

హతుడి ఎవరనేది తేలితేనే కేసు దర్యాప్తు సులువవుతుందని భావించిన పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన వందలాది అదృశ్యం కేసుల వివరాలను సేకరించారు. ఘటనాస్థలంలో మృతదేహంపై లభ్యమైన వస్తువులు, హతుడి వయసు, పోలికలతో యువకుల అదృశ్యం కేసుల వివరాలను పోలుస్తున్నారు. ఘటనాస్థలం, పరిసర ప్రాంతాలలో ఎలాంటి సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో పాటు మృతదేహంపై ఎలాంటి కత్తిపోట్లు, గాయాలను పోలీసులు గుర్తించలేదు. శరీరంలో విష ప్రయోగం ఆనవాళ్లు సైతం ఫోరెన్సిక్ పరీక్షలలో వెల్లడికాలేదు. దీంతో కేసు దర్యాప్తు పూర్తిగా సాంకేతిక ఆధారాల పైనే ఆధారపడి ఉందని ఓ పోలీసు అధికారి తెలిపారు. మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి హత్య ఈనెల 8–10 తేదీలలో జరిగి ఉండొచ్చని, దీంతో ఆయా తేదీలలో ఓఆర్‌ఆర్ మీద ప్రయాణించిన సుమారు 12 లక్షల వాహనాలను, లక్షల కొద్ది ఫోన్ కాల్స్‌ను జల్లెడ పడుతున్నామని తెలిపారు. లక్షల్లో ఉన్న డేటా వందల్లోకి వస్తేనే దర్యాప్తు కొలిక్కి వస్తుందని చెప్పారు.

ఆయనో పెద్ద కబ్జాకోరు

- కోళ్ల దాణా, కోడుగుడ్ల స్కామ్‌లో నిందితుడు
- ఫిలింనగర్‌లో దేవాలయ భూమిని ఆక్రమించాడు
- చేవెళ్లలో వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం
- ఎంపీ రంజిత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రత్నం ఫైర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'రంజిత్‌రెడ్డి ఓ పెద్ద కబ్జాకోరు. ఆయన ఫిలింనగర్‌లోని దేవాలయ భూమిని ఆక్రమించాడు. ఆయనపై కోళ్ల దాణా, గుడ్ల కుంభకోణం ఆరోపణలు ఉన్నాయి. గోపన్‌పల్లి, నానక్‌రాంగూడలోనూ విలువైన స్థలాలను కొల్లగొట్టాడు. కేటీఆర్‌కు ఆయన ఓ బినామీ. ఐదేళ్లలో ఆయన చేవెళ్లకు చేసిందేమీ లేదు' అని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆరోపించారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ నేతలు రవికుమార్ యాదవ్, తోకల శ్రీనివాసరెడ్డితో కలిసి మాట్లాడారు. ఎంపీగా ఆయన ధ్యాసంతా సంపాదనపైనే ఉందన్నారు. లోక్‌సభలో ఏనాడూ చేవెళ్ల ప్రజల కష్టాలను ప్రస్తావించలేదన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, ఏ ఒక్క రోడ్డునూ వేయించలేకపోయారని విమర్శించారు. సొంత ఫాంహౌస్‌కు ప్రభుత్వ నిధులతో రోడ్డును వేయించుకున్నారని, ప్రస్తుతం ఈ ఫాంహౌస్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలోని పెద్దలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చు కోకపోతే.. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించాడని, బేషరతుగా ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు హడావుడిగా రంగారెడ్డి–పాలమూరు ప్రాజెక్టును ప్రారంభించారని, పనులు పూర్తి కాక ముందే ప్రారంభించి రైతులను మోసం చేశారని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు. 111 జీఓ రద్దు చేసినట్లు ప్రకటించినా.. ఇప్పటికీ కోర్టుల్లో కేసు పెండింగ్‌లోనే ఉందన్నారు. శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పంపిణీలో స్థానికులకు తీరని అన్యాయంజరుగుతున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు.

నెహ్రూ యువ కేంద్ర సలహా కమిటీ సభ్యుడిగా రూపక్



ఇబ్రహీంపట్నం: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా సలహా కమిటీ సభ్యుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన సూరంపల్లి రూపక్ నియమితులయ్యా రు. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రూపక్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ, రాష్ట్ర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో పలు యువజన కార్యక్రమాలను పట్టణాలు, పల్లెల్లోకి తీసుకెళ్లి యువతను చైతన్యపర్చనున్నట్లు చెప్పారు.